## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:243 | శుక్రవారం ఏప్రిల్ 3, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00




# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

## అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

## ప్రధాని మోడీని కలిసి లోకేశ్ కృతజ్ఞతలు

అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లుకు లోక్‌సభలో ఏకగ్రీవ ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. గురువారం బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టారు. హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో అమరావతికి చట్టబద్ధత బిల్లును పేజి 2లో ▶

## మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



2లో..

## కాళేశ్వరంపై రాజ్యసభలో కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం



2లో..

## అమరావతికి చట్టబద్ధత బిల్లు.. రైతుల విజయం: ఎంపీ రేణుకాచౌదరి



2లో..

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

## సభల్లో సిఎం రేవంత్ సందేశం విడుదల

ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్నాయి . సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సందేశం అందించారు. గ్రామ సభల్లో అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు... సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్ధతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు... ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన– ప్రగతిప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి.



2లో..

## 'అమరావతి బిల్లు' కు రాజ్యసభ ఆమోదం



దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. అంతకుముందు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఎంపీ రేణుకా చౌదరి చర్చ ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైకాపా వాకౌట్ చేసింది. ఇప్పటికే అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ ఆమోదించిన సంగతి తెలిసిందే. పేజి 2లో ▶

## పోలవరం ప్రాజెక్టు కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి



అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయింది. గత ప్రభుత్వం నిర్వాకంతో డయాఫ్రం వాల్ దెబ్బతిని, రూ.440 కోట్ల మేర ప్రజాధనం వృథా అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. నిపుణుల సూచనలతో రూ.900 కోట్లతో మరో డయాఫ్రం వాల్ నిర్మించింది. గతేడాది జనవరి 18న పనులు ప్రారంభించి.. రికార్డు స్థాయిలో 440 రోజుల్లో 1,372 మీటర్ల పొడవైన కొత్త డయాఫ్రం వాల్ నిర్మించింది. ఈ పనులు పూర్తికావడంతో మంత్రి నిమ్మల రామానాయుడు ఇంజినీర్లను సన్మానించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద స్వీట్లు పంచారు. పేజి 2లో ▶

## సమీకృత భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.



## గ్రూప్-1 నియామకాల్లో జోక్యానికి 'సుప్రీం' నిరాకరణ



2లో..



## మోదీ సంకల్పం సాకారానికి వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకం: లక్ష్మణ్

దిల్లీ: రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని భాజపా రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. భవ్య రాజధాని సాకారం కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని చెప్పారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకమని తెలిపారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరముందని అన్నారు. పేజి 2లో ▶

## పవిత్ర భూమిలో రాజధాని వర్ధిల్లుతుంది: ఆర్. కృష్ణయ్య

దిల్లీ: ఏపీ రాజధానిగా అమరావతికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు భాజపా రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఏపీకి మధ్యలో అమరావతి ఉంటుందని, పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. అమరావతికి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేజి 2లో ▶



# అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం



## కుట్రలు, కుతంత్రాలకు ఇక చెక్ పడినట్లే

## అమరావతి బిల్లుపై పవన్ హర్షం

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందడం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా రాజధాని ఉనికిపై సాగిన కుట్రలు, అపోహలు, న్యాయపరమైన చిక్కులన్నింటినీ అధిగమించి.. నేడు పార్లమెంట్ సాక్షిగా అమరావతి అజేయమైన శక్తిగా అవతరించిందని చెప్పారు. అమరావతి ఇక అజేయమని, అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అమరావతి అభివృద్ధికి బలమైన తోడ్పాటు అందిస్తూ, చట్టబద్ధత బిల్లును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి ప్రత్యేక ధన్యవాదాలు'. పేజి 2లో ▶

## సారాయి తయారీకి బెల్లం అమ్ముతున్న వ్యక్తికి 50,000/- జరిమానా



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ ఏప్రిల్ 2**

మహబూబాబాద్ మున్సిపాలిటీలోని కురవి గేటు ప్రాంతానికి చెందిన గరిపెల్లి నాగేశ్వరరావు గతంలో సారాయి తయారీ కొరకు బెల్లం మరియు పటిక అమ్మగా అతనిపై కేసు నమోదు చేసి మహబూబాబాద్ తాహసిల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగింది. అతడు మరలా సారాయి తయారీకి బెల్లం సరఫరా/ అమ్మకం చేయగా అతనిపై కేసు నమోదు చేయగా, బైండోవర్ ఉల్లంఘనకు గాను తాసిల్దార్ మహబూబాబాద్ గారు అతనికి 50 వేల జరిమానా విధించగా, అతడు ఈరోజు చెల్లించడం జరిగింది. ఎవరైనా సారాయి తయారీకి బెల్లం, చక్కెర లేదా పటిక సరఫరా చేసిన / అమ్మినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామసభ, భీమారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఉష్క మల్ల విజయలక్ష్మి



**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాలిక కార్యక్రమంలో భాగంగా భీమారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రోజున గ్రామసభ నిర్వహించారు, సందర్భంగా భీమారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఉష్క మల్ల, విజయలక్ష్మి మాట్లాడుతూ, గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకొని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు, గ్రామ సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభివృద్ధికై ప్రవేశపెట్టిన వివిధ రకాల పథకాల లబ్ధిదారులు తమకు ప్రభుత్వం నుండి అందుతున్న ప్రయోజనాలను తెలియజేశారు, కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఐకెపి ఎపిఎం గడ్డం శ్రీనివాస్ గౌడ్, మండల పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి, వార్డు సభ్యులు, ప్రజలు, పాల్గొన్నారు

## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ రోజు 40వ వార్డులో నిర్వహించిన వార్డు సభ కార్యక్రమంలో హాజరై ఆయన మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ గారు పాల్గొన్నారు




ఈ సందర్భంగా మాట్లాడుతూ, వార్డు సభల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి, వార్డు స్థాయి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఇవి ముఖ్య వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు.
ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, పింఛన్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో భాగంగా వార్డు స్థాయి సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు

మొదటిపేజీ తరువాయి

మహాలక్ష్మి... ఉచిత బస్సుసౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్,ప్యూర్, రేర్గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు.. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారాన్ని కోరుకుంటూ మీ రేవంత్ రెడ్డి అన్న సందేశాన్ని విడుదల చేశారు.

## కాళేశ్వరంపై రాజ్యసభలో కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.
"కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారు" అని కిషన్‌రెడ్డి అన్నారు.
తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి: సురేశ్‌రెడ్డి
కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. " ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి.

## అమరావతికి చట్టబద్ధత బిల్లు.. రైతుల విజయం: ఎంపీ రేణుకాచౌదరి

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: అమరావతికి చట్టబద్ధత బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టడం ఆ ప్రాంత రైతుల విజయమని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. బిల్లుపై నిర్వహించిన చర్చలో ఆమె మాట్లాడారు. " ఏపీ రాజధానిపై 12 ఏళ్లుగా అస్పష్టత ఉంది. దీంతో పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. గత సీఎం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదు. 12 ఏళ్ల తర్వాత కూడా ఆస్తుల పంపకం పూర్తికాలేదు. కేంద్రం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందే. ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలి"అని రేణుకా చౌదరి కోరారు.

## గ్రూప్-1 నియామకాల్లో జోక్యానికి 'సుప్రీం' నిరాకరణ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఇంతకుముందు హైకోర్టును ఆశ్రయించారు. మూల్యాంకనంలో తప్పులున్నాయని, నోటిఫికేషన్ రద్దు చేసి.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు.
విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్.. గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కనిపించలేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని కోర్టుకు వివరించారు. మూడుసార్లు మూల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## ఎట్టకేలకు ఎపి రాజదానికి గ్రహణం వీడింది.

**-నూతన రాజధాని అమరావతిపై ఆమోదం పట్ల హర్షం.**

**-అపిలేపల్లి ప్రధానోపాధ్యా యుడు బిసి, తిమ్మప్ప.**

**కుందుర్పి, ఏప్రిల్, 2,జనసముద్రం న్యూస్ ;**



గతంలో ఏపీ రాజధాని రాజధాని లేక గ్రహణం పట్టుకొందని , ఎట్టకేలకు ఏపీ రాజధానికి గ్రహణం వీడింది అని,అపిలేపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయ, బీసీ తిమ్మాప్ప అన్నారు.గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి ఏర్పాటు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పార్లమెంట్ ఉభయ సభలలోను ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చేయాలని ఆమోదం పొందడం చాలా సంతోషమని చెప్పారు, ఇన్ని రోజులు ఎపికి రాజధాని లేకుండా దురదృష్టకరమని అన్నారు, ఇప్పటికైనా రాజధానిని అమరావతిని ఎంపిక చేయడం చాలా గర్వకారణమని తెలియజేసారు. రాష్ట్ర రాజధాని అయిన అమరావతి గొప్ప రాజధాని నగరంగా భవిష్యత్తులో ఎదగాలని ఆయన ఆకాంక్షించారు, ఇప్పటికే పలు జాతీయ సంస్థలు అక్కడ ఏర్పాటు చేసినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నా ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# అమరావతికి చట్టబద్ధతకు థాంక్స్

మొదటిపేజీ తరువాయి

లోక్‌సభ ఆమోదించిన నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజార్జీతో లోక్‌సభలో ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని మోదీకి లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం ఉదయం పార్లమెంట్ హాలులో మంత్రి లోకేశ్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతికి చట్టబద్ధత కల్పించిన ప్రధాని మోదీకి ఆంధప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ ఆగమేఘాలపై ఢిల్లీ వెళ్లారు. కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి చూపిన నిబద్ధతను మంత్రి లోకేశ్ ప్రశంసించారు.

## మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

న్యూఢిల్లీ,: పసిడి ప్రియులకు శుభవార్త. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉంటాయోనని భయాందోళన చెందుతున్న తరుణంలో మగువలకు తీపికబురు. నిన్నటి రోజున భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. కొన్ని గంటల వ్యవధిలోనే భారీగా తగ్గాయి. పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో భారీ ఊరట లభించింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గగా.. కిలో వెండిపై రూ.5,000 తగ్గింది. తులం గోల్డ్‌పై రూ.1,530 తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,51,420 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గడంతో రూ.1,38,800 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,440 తగ్గడంతో రూ.1,13,570 దగ్గర ట్రేడ్ అవుతోంది. సిల్వర్ ధర కూడా భారీ దిగొచ్చింది. గురువారం కిలో వెండిపై ఏకంగా రూ.5,000 తగ్గింది. దీంతో బులియన్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది. హైదరాబాద్, చెన్నైలో మాత్రం కిలో వెండి ధర రూ.2,55,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, బెంగళూరులో మాత్రం కిలో వెండి ధర రూ.2,50, 000 దగ్గర అమ్ముడవుతోంది.

## 'అమరావతి బిల్లు' కు రాజ్యసభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతికి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉంటాయన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి చట్టబద్ధత బిల్లు చట్టంగా మారనుంది. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ బిల్లుపై చర్చలో పాల్గొనగా.. 10 పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.

## అజేయమైన శక్తిగా అమరావతి ఆవిర్భావం

మొదటిపేజీ తరువాయి

ఈ చరిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పక్షాలు నిర్వహించే సంబరాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలి. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు, పార్టీ కార్యాలయాల వద్ద దీపాలు వెలిగించి అమరావతి విజయోత్సవాన్ని జరుపుకోవాలి' అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ అనంతరం రాజ్యసభలోనూ బిల్లు నెగ్గడంతో రాజధానిగా అమరావతికి ఇక ఎదురులేదని, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వించ దగ్గ శుభపరిణామమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ అమోదం పొందటంతో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంలో ఉన్నారు. వారంతా ఎంతో గర్వించే క్షణాలు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుంది. లోక్‌సభలో ఈ బిల్లుకు మద్దతు తెలియజేసిన ఇతర పార్టీలు, ఎంపీలకు ధన్యవాదాలు. అమరావతికి చట్టబద్ధత లభించడం జీర్ణించుకోలేక విషం చిమ్ముతున్నవారికి రాబోయే రోజుల్లో ప్రజలు గొప్ప గుణపాఠం నేర్పిస్తారు.

## మోదీ సంకల్పం సాకారానికి వికసిత్ ఆంధ్ర నిర్మాణం ఆవశ్యకం: లక్ష్మణ్

మొదటిపేజీ తరువాయి

"రాజధాని కోసం సుదీర్ఘంగా పోరాడిన మహిళలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. అమరావతి బిల్లు ఆమోదం కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. తెలుగు వారి కోసం ఆంధ్రరాష్ట్రం రావాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చింది.
దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు. అమరావతి రాజధాని సంకల్పం తీసుకొని ముందుకెళ్లారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని ప్రకటించారు. కానీ, జగన్.. మూడు ముక్కలాట ఆడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారు" అని లక్ష్మణ్ అన్నారు.

## పవిత్ర భూమిలో రాజధాని వర్ధిల్లుతుంది: ఆర్. కృష్ణయ్య

మొదటిపేజీ తరువాయి

"రాజధాని అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారు. పవిత్ర భూమిలో రాజధాని వర్ధిల్లుతుంది. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలి. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అనేక రకాలుగా నిధులు సమకూరుస్తోంది.
హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేయడం అందరం చూశాం. అమరావతిని అభివృద్ధి చేయాలనే తపన ప్రధాని మోదీకి కూడా ఉంది. బలహీనవర్గాల రాజధానిగా రూపుదిద్దుకుంటుందన్న నమ్మకం ఉంది. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా చేయడంలో చంద్రబాబు విజయం సాధిస్తారు. అనుకూలమైన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి చాలా ప్రయోజనకరం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సలహాలు, సూచనలు చేయాలని కోరుతున్నా. విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి పవిత్ర క్షేత్రాల అభివృద్ధికి ప్రధాని సహకరిస్తున్నారు. రాజధాని అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో చూసి విమర్శలు చేయొద్దని సూచిస్తున్నా" అని కృష్ణయ్య అన్నారు.

## సేంద్రియ ఎరువుల వాడకం... పంట మార్పిడితో అధిక దిగుబడులు

**•జిల్లా కలెక్టర్ కె హైమావతి**

**జన సముద్రం న్యూస్ కోహెడ ఏప్రిల్ 2: ( కోహెడ ప్రసాదరావు)**

సేంద్రీయ ఎరువులు వాడకం తో పాటు పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులను సాధించవచ్చునని రైతులు ఈ దిశగా ఆలోచన చేయాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అన్నారు.

సిద్దిపేట జిల్లాకొండపాక మండలం దుద్దెడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో గురువారం ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కే.హైమావతి పాల్గొన్నారు.ముందుగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభను ఉద్దేశించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పంపించిన సందేశాన్ని గ్రామస్తులకు చదివి వినిపించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను వివరించి దుద్దెడ గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులను సంక్షేమ కార్యక్రమాలను లబ్దిదారుల వారిగా వివరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి తదితర పథకాల లబ్దిదారులు వారి అనుభవాలను సభలో వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆరోగ్యవంతంగా



జీవించాలంటే సేంద్రియ వ్యవసాయానికి రైతులు ముందుకు రావాలని, పంట మార్పిడి విధానం పాటించాలని, గ్రామంలో కోతుల బెడదను నివారించాలని, అర్హత ఉన్న పేదవారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, మరియు రాష్ట్ర స్థాయిలలో ఐదు అంచెలుగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దానిలో భాగంగా ఈరోజు జిల్లా వ్యాప్తంగా 508 గ్రామపంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని మరియు ఐదు మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజల అభివృద్ధి కోసం గ్రామాలు, పట్టణాలలో మౌలిక వసతులను కల్పించడమే



కాకుండా మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, మహిళ స్వయం సహాయ సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, రైతు బీమా తదితర ప్రాధాన్యత కార్యక్రమాలను అమలు చేయడమే కాకుండా ఎదిగే వయసులో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతనంగా జూన్ నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం మరియు ప్రీ ప్రైమరీ స్కూల్ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకం అమలు చేయడం జరుగుతుందని, ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగుల విద్యార్థుల కొరకు వాహన సౌకర్యం కల్పించడం జరుగుతుందని, కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని అమలు చేయడం జరిగిందని వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి, ఎంపీడీవో, గ్రామ ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో నిలదీసిన జనం: పెద్దవీడు లో అధికారులకు చుక్కెదురు

**•చేవెళ్ల నియోజకవర్గం ప్రతినిధి,**

**జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 02 చేవెళ్ల, షాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా,**

పెద్దవీడు గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" సభ రసాభాసగా మారింది. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, అధికారులు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నారని స్థానిక ప్రజలు మండిపడ్డారు.గ్రామ సర్పంచ్, ప్రత్యేక అధికారి మరియు వార్డు సభ్యుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. అయితే, చర్చ మొదలైన కొద్దిసేపటికే గ్రామస్తులు తమ నిరసనను గళమెత్తారు. వృద్ధులకు, వితంతువులకు రావాల్సిన పింఛన్లు సక్రమంగా అందడం లేదని కనీసం ఇచ్చే పింఛన్లు అయిన టైంకి ఇవ్వడం లేదు అని అంటున్నారు కొత్తగా అప్లై చేసిన పించన్లు రాక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా



ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మహాలక్ష్మి పథకంపై ఆగ్రహం: మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న 'మహాలక్ష్మి' పథకం కేవలం పేరుకే ఉందనీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖాతాల్లో పడలేదని మహిళలు అధికారులను నిలదీశారు.గ్యాస్ సబ్సిడీ ఊసేది?: రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న హామీ ఎటు పోయిందని, ప్రస్తుత ధరలతో సామాన్యులు బతకడం కష్టంగా మారిందని జనం ఆగ్రహం వ్యక్తం చేశారు.శూన్యమైన అభివృద్ధి: ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊరిలో ఒక్క కొత్త పని కూడా జరగలేదని, కనీసం డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులు కూడా పట్టించుకోవడం లేదని



వార్డు సభ్యులు సైతం అసహనం వ్యక్తం చేశారు."ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. దరఖాస్తులు తీసుకోవడం తప్ప, లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదు." అని గ్రామస్తులు ఆరోపించారు.అలాగే తులం బంగారం ఏమైంది అని ప్రజలు అంటున్నారు చివరికి అధికారులు స్పందిస్తూ.. సాంకేతిక కారణాల వల్ల కొన్ని పథకాలు ఆలస్యమవుతున్నాయని, ప్రజల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సర్దుమణిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైతాబాద్ లో ఉత్సాహంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

**•చేవెళ్ల నియోజకవర్గం ప్రతినిధి,**

**జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 02: షాబాద్ మండలం రంగారెడ్డి జిల్లా.**

హైతాబాద్ గ్రామస్తుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తూ హైతాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ప్రత్యేక అధికారి మరియు వార్డు సభ్యులు అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు మరియు భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు.సమస్యల స్వీకరణ: గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, మరియు



తాగునీటి సరఫరాపై ప్రజల నుండి వినతులను స్వీకరించారు.సంక్షేమ పథకాలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, దరఖాస్తుల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని అధికారులు సూచించారు.అభివృద్ధి ప్రణాళిక: వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామంలో చేపట్టాల్సిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు మరియు వీధి దీపాలు ఆధునీకరణపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్ మాట్లాడుతూ, "ప్రజా పాలన అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉన్న వారధి. వార్డు సభ్యుల సమన్వయంతో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేయడమే మా లక్ష్యం. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం," అని పేర్కొన్నారు.వార్డు సభ్యులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా పెండింగ్ పనులను పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రైతుపై అడవిపంది దాడి తీవ్ర గాయాలు

**జన సముద్రం న్యూస్ గంగారం మండలం ఏప్రిల్ 2**

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పుట్టల భూపతి గ్రామానికి చెందిన సోలం రవికుమార్ వయసు 35 సంవత్సరాలు రోజు మాదిరిగానే తన మొక్కజొన్న చేను కావలికి వెళ్ళగా అప్పటికే చేనులో పంటను తింటూ ఉన్న అడవి పంది ఒక్కసారిగా వచ్చి రవికుమార్ పై దాడి చేసి ఎడమ కాలు తొడను మోకాలిని కొరికి తీవ్ర గాయాలు చేయగా చుట్టుప్రక్కల చేనులవాళ్లు వచ్చి అరవడంతో అడవి పంది అక్కడనుండి అడవిలోకి వెళ్లిపోయింది కుటుంబ సభ్యులు



వెంటనే రవికుమార్ ను 108 లో నర్సంపేటలోని ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకువెళ్లగా తీవ్ర గాయాల పాలైన రవికుమార్ కు డాక్టర్లు తొంటికి ఆపరేషన్ చేశారు. రవికుమార్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. మండలంలో ఎప్పుడూ లేని విధంగా అడవి పంది దాడి చేయడంతో రైతులు తమ పంటలు చేతికి రావాలంటే ఇంకా చాలా సమయం పడుతుంది ఇలా అయితే మా చేను దగ్గర ఎలా కాపలా ఉండాలి అని గ్రామ రైతులు ఎంతో భయాందోళనకు గురవుతున్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**వెల్దండ,ఏప్రిల్,03(జనసముద్రం న్యూస్)**

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రత్యేక కార్యక్రమం) లో భాగంగా నిర్వహించిన గ్రామసభ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు,మహిళా సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.గ్రామానికి 48 ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇంకా ఇళ్లు లేని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు.

గ్రామానికి చెందిన 989 మంది లబ్ధిదారులకు ఉచిత కరెంట్ అందించామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి వారికి ఉచితంగా సన్న బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తోందని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కావాలని గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన అన్నెపు పద్మ అనే బాధితురాలికి




19000/- వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాజీ సర్పంచి యెన్నం భూపతి రెడ్డి, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ కృష్ణయ్య,డీఈ బసవలింగం, ఏడీ శంకర్, తహశీల్దార్ కార్తీక్ కుమార్, మండల వైద్యాధికారిణి సింధు,ఉప సర్పంచ్ బస్సమోని శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు గౌడ్,కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, పసునోజు వాణి పురుషోత్తం, ముదికొండ కవిత రమేష్, మారేపల్లి మంజుల శ్రీను,గుద్దటి కిష్టయ్య, గోసుల కొండయ్య, మసిగుండ్ల వెంకటేష్, జంగిలి సునీత ఆనంద్, బాదేపల్లి రమేష్, పిల్లి దేవేందర్ ,రేవల్లి మానస రాజు, సిర్సనగండ్ల శేఖర్, రవీందర్ రెడ్డి, నాయకులు ఎండి రషీద్, తిరుపతి రెడ్డి, మండలమోని కృష్ణ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్,కొయ్యల పుల్లయ్య,రేవల్లి రంగయ్య,అన్నెపు వెంకటేష్, రాజు,అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి గ్రామంలో దొంగతనానికి పాల్పడిన నిందితుని అరెస్ట్



**ఎల్కతుర్తి ఏప్రిల్ 02 (జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.తేదీ 31-03-2026న ఎల్కతుర్తి గ్రామానికి చెందిన నరిగే సంధ్య (భర్త: రవి, వృత్తి: కూలి) ఇంటిలో పట్టపగలు తాళం పగులగొట్టి దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎల్కతుర్తి ఎస్సై ఏ. ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా 02-04-2026 మధ్యాహ్నం ఎల్కతుర్తి శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా



పారిపోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని పట్టుకుని విచారించారు. అతను పత్తిపాక గ్రామానికి చెందిన వలపదాసు ప్రవీణ్ (తండ్రి: చంద్రమౌళి, శాయంపేట మండలం)గా గుర్తించారు. విచారణలో అతను దొంగతనానికి పాల్పడినట్టు ఒప్పుకున్నాడు.నిందితుడి వద్ద నుంచి పోలీసులు సుమారు 9 గ్రాముల బంగారం, 210 గ్రాముల వెండి నగలు, రూ.20,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన ఆస్తి మొత్తం విలువ రూ.95,000గా అంచనా వేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై ఏ. ప్రవీణ్ కుమార్, కానిస్టేబుల్లు భాస్కర్, బక్కయ్య, రంజిత్, సుమన్, అలాగే హోంగార్డులు భాస్కర్, శ్రీనివాస్‌లను ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ అభినందించారు.

## వల్లభాపూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ఎల్కతుర్తి ఏప్రిల్ 02(జనసముద్రం)**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామంలో 38 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటుకూరి గౌతం ఆధ్వర్యంలో లబ్ధిదారుడు దగ్గు కిషన్ రావుకు అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు గురువారం ఈ చెక్కును అందజేసినట్లు గ్రామ అధ్యక్షుడు కటుకూరి గౌతం తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ 25వ వార్షిక వేడుకలు.

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**



ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని లిటిల్ స్కాలర్స్ హై స్కూల్ 25 వార్షిక వేడుకలు (సిల్వర్ జూబ్లీ వేడుకలు) ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా మొదటిగా జ్యోతి ప్రజ్వలన చేయడం జరిగింది. అనంతరం. యూకేజీ నుండి ఐదో తరగతి వరకు. విద్యార్థులకు.గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం జరిగింది. అనంతరం విద్యా వ్యవస్థలో, పాఠశాల చైర్మన్ చుక్క. అల్లాజి గౌడ్ , మరియు జిల్లెల్ల సుదర్శన్ రెడ్డి. దేశ భవిష్యత్తును విద్యార్థుల భవిష్యత్తును నిర్మించే విద్య వ్యవస్థలో"40 ఏళ్లు"పూర్తి చేసిన సందర్భంగా. సమాజంలో, విద్యా వ్యవస్థలో, ఉపాధ్యాయ వృత్తిలో. ధార్మిక సంస్థలలో, రాజకీయ అంగన్ లో. మరియు సమాజ సేవ. లైన్స్ క్లబ్ ల.వీరు చేసిన సేవలను పలువురు వ్యక్తులు కొనియాడారు. ఈ సందర్భంగా. ప్రశంస పత్రాలతో, వీరిద్దరినీ ఘనంగా సత్కరించడం జరిగింది,. అనంతరం. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు తల్లిదండ్రులను అతిథులను ప్రేక్షకులను అలరించాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు. నాటకాలు. విద్యార్థులు చాలా చక్కగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో. లిటిల్ స్కాలర్స్ విద్యాసంస్థలలో చదువుకున్న అనేక రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, డాక్టర్ లు, ఇంజనీర్లుగా, లాయలుగా, సమాజంలో ప్రముఖులుగా గుర్తింపు పొంది. విద్యార్థులు అతిథులుగా వచ్చారు. పాఠశాలలోనే వారి. చిన్ననాటి జ్ఞాపకాలను. పాఠశాలతో , పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చుక్క అల్లాజిగౌడ్, సావిత్రి, సుదర్శన్ రెడ్డి. సుజాత, శ్రీశైలం, యాదయ్య. శ్వేత. అహ్మద్ తదితర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు. తల్లిదండ్రులు. పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం..

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేర్చాలి.
- ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామసభలు..
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.

**మహేశ్వరం, ఏప్రిల్ 2, జన సముద్రం న్యూస్:**

అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ తుమ్మటి అండాలు కృష్ణ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజులపాటు గ్రామాలలో, పట్టణాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు కడుతున్న పన్నులతోనే



పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రతి సంవత్సరం అభివృద్ధి సంక్షేమానికి 60 వేల కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఆమోదం మేరకే పట్టణం గ్రామాలలో గ్రామసభలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క లబ్ధిదారుడికి చేకూరే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు చేర్చాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సొంత ఇంటిని నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి గ్రామంలోనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నాలుగు కోట్ల ప్రజలు 60 లక్షల రైతులు వివిధ రకాలుగా ప్రభుత్వ పథకాలను అందుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో రెండున్నర కోట్ల మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం శరవేగంగా పట్టణీకరణ, పారిశ్రామీకరణ జరుగుతుందని అన్నారు. విద్యా, వైద్యం పేద ప్రజలకు మౌలిక వసతులను కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, చంద్రారెడ్డి, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, డిఆర్డిఓ శ్రీలత, అడిషనల్ డి ఆర్ డి ఓ సుభాషిని, సీఈఓ కృష్ణారెడ్డి, జిఎం ఇండస్ట్రియల్ శ్రీలక్ష్మి, డిసిపి నారాయణరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి వన జాత,ఎంపీడీవో శైలజా రెడ్డి, ఎంపీవో రవీందర్ రెడ్డి, తాసిల్దార్ చిన్న అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్, పంచాయతీ కార్యదర్శి అలివేలు గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హాస్టల్ వార్డెన్ పై మండిపడ్డ జిల్లా కలెక్టర్

**---మెనూ ప్రకారం భోజనం లేదంటూ ఆగ్రహం..**
**--చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు**

**జనసముద్రం న్యూస్, కోహెడ ఏప్రిల్ 2 :(కోహెడ ప్రసాదరావు)**

విద్యార్థులకు సరిపడా కూరలు వండడం లేదని అలాగే మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందివ్వడం లేదని వార్డెన్ పై జిల్లా కలెక్టర్ మండిపడ్డ సంఘటన ఇది.
సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె హైమావతి గురువారం ఆకస్మికంగా సందర్శించారు.మధ్యాహ్న భోజన ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
అన్నం, పప్పు, బెండకాయ, రసం, పెరుగులను పరిశీలించారు. కూరల నాణ్యత



మెరుగు పరచాలని చేసిన కూరలు దాదాపు 40 మంది విద్యార్థులకు సరిపోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం కొలత ప్రకారం ఆహార సరుకులను అందిస్తూ ఆహార పదార్థాలు విద్యార్థులకు సరిపడేంత, రుచికరంగా వండాలని మీ ఇష్టానుసారంగా ఏదో ఒక కూరతో సరి పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూర సరిపడినంత వండలేదని హాస్టల్ వార్డెన్ పైన యాక్షన్ తీసుకోవాల్సిందిగా డిసిఒను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు భోజనం, వసతి, చదువు విషయంలో రాజీ పడవద్దని విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హాస్టల్ వార్డెన్ నుండి ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

# నక్కలపల్లిలో ఘనంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' గ్రామ సభ

**చేవెళ్ల నియోజకవర్గం ప్రతినిధి, జనసముద్రం న్యూస్, ఏప్రిల్ 02,**

మొయినాబాద్ మండలం రంగారెడ్డి జిల్లా నక్కలపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మంగళారం యదయ్య అధ్యక్షతన గ్రామ సభ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమానికి సంబంధించిన పనులపై సమగ్రంగా చర్చ జరిగింది.ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 2 సంవత్సరాలు 3 నెలలు పూర్తైన సందర్భంగా, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి మరియు సంక్షేమ



కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్,



ప్రత్యేక అధికారి అహ్మద్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జన్మోత్సవ వేడుకల్.

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**

హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా హనుమాన్ దేవాలయం ( అంగడి బజార్) ఉదయం 6.30 ని"లకు అభిషేక కార్యక్రమం చెయ్యడం జరిగింది.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.జై శ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామకృష్ణ అయ్యగారు. నాగిళ్ళ జగన్. పాతకోట శ్రీశైలం (శిరి).జెజ్జాల ఆనంద్.దాస్యం వంశీ. ముఖ్యరి



వెంకటేష్.కోట్ల వెంకటేష్.లండం మల్లేష్. నరేష్.రామకృష్ణ మరియు భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక పి.ఎ.సి చైర్మన్ గాంధీ

**జనసముద్రం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఏప్రిల్ 3**

ఎల్లమ్మ బండ 124 డివిజన్ పరిధిలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ కమాన్ ఎదురుగా ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ హైదర్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు మరియు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి,



పరాక్రమానికి ప్రతీక అని అన్నారు. సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి స్ఫూర్తిగా నిలిచిన సర్వాయి పాపన్న వీరగాథను పాపన్న జయంతి సందర్భంగా స్మరించుకున్నారు. ఆనాటి సమాజంలో నెలకొన్న నిరంకుశ రాజరిక పోకడలకు వ్యతిరేకంగా సబ్బండ వర్గాలను ఏకం చేసి, పాపన్న పోరాడిన తీరు గొప్పదని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాండుగౌడ్, బి.వెంకటేష్ గౌడ్, చంద్రకాంత్ రావు, రాందాస్ గౌడ్, అభి గౌడ్, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, గోపాల్, మల్లేష్, నరసింగ రావు, షౌకత్ అలీ మున్నా, మజర్, ఖాజా, లింగం, సుధాకర్, రాజు గౌడ్, వెంకటేష్ గౌడ్, ఖలీమ్, సత్యనారాయణ, హరీష్, రవీందర్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలాలను ప్రజలకు అందేలా చూడాలి జగదీష్ గౌడ్

**జనసముద్రం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఏప్రిల్ 3**

శేర్లింగంపల్లి నియోజకవర్గంలో స్వార్ధ రాజకీయాలకు అతీతంగా.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా.ప్రజా ప్రభుత్వపు ఫలాలను శేరిలింగంపల్లి ప్రజలకు అందించాలనే లక్ష్యం తో పని చేస్తూ.
పదవులు, ఆస్తులు కాపాడుకోడానికి దిగజారే రాజకీయాలు చేస్తున్న ఎందరో నాయకులకు భిన్నంగా తన పని తోనే శేరిలింగంపల్లి ప్రజలలో గుర్తింపు తెచ్చుకున్న శేరిలింగంపల్లి ఐకానిక్ లీడర్ మన జగదీశ్వర్ గౌడ్



ప్రజలకు ఉదయం నుండే తన కార్యాలయంలో అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు

# సాయిరెడ్డిగూడ గ్రామ సభ విజయవంతం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనసముద్రం న్యూస్, ఏప్రిల్ 02**

సాయిరెడ్డిగూడ గ్రామంలో గ్రామ సర్పంచ్ కొంగల్ల అనిత అధ్యక్షతన గ్రామ సభ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమానికి సంబంధించిన పనులపై సమగ్రంగా చర్చ జరిగింది.
ఎల్లపల్లి విజయ్ మరియు పలువురు మహిళలు మాట్లాడుతూ మా కాలనీ లో 5 ఇండ్లకుత్రాగునీరు అందడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు.
రైతు భరోసా కింద ఎన్ని ఎకరాలున్నా 6000మాత్రమే జమ అయినాయి అని



ప్రశ్నించిన గ్రామస్తులు.
బొర్ర రాములు మాట్లాడుతూ 3వ వార్డు లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంబాన్ని మరమ్మతు చేయాలనీ గ్రామ సభ లో సంబంధిత అధికారులకు తెలియజేసారు.
ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 2 సంవత్సరాలు 3 నెలలు పూర్తైన సందర్భంగా, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను గ్రామ ప్రజలకు వివరించారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను అడిగి



తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కార్యకర్త శ్రీకాంత్ గుప్తా,ఉప సర్పంచ్ సకీలాల శ్రీను , పంచాయతీ కార్యదర్శి పంతునాయక్ , వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు,

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2, 2026:**

తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలోని నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల, జిల్లా స్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఉపాధి అవకాశాల సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని, కార్యాలయాల నోటీసు బోర్డులలో ప్రదర్శించాలని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యాసంస్థల ప్రిన్సిపాల్ లు అర్హులైన విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు సమాచారం అందించాలని తెలిపారు. పలు దేశాలలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అర్హత గల మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జర్మనీ దేశంలో నర్సింగ్, ఎలక్ట్రికల్/పవర్ లైన్ టెక్నీషియన్ ఉద్యోగాలు, ఖతర్- దోహా దేశంలో నర్సింగ్ ఉద్యోగాలు,



గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ, హౌస్ కీపింగ్, వెయిటర్లు, బార్బెండర్లు, వంట మనుషులు, హోటల్ రిసెప్షనిస్ట్, స్పా థెరపిస్టులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, లైఫ్ గార్డులు, గార్డెనర్లు, బెల్ బాయ్స్, ఫిషర్ మెన్ ఇతర ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగాల సంబంధిత విద్యార్హతలతో పాటు అభ్యర్థుల వయసు 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ఇంగ్లీష్ భాష పరిజ్ఞానం కలిగి ఉండాలని, 2, 3 సంవత్సరాల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, వసతి, ఆహారం, మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి అర్హత గల మైనారిటీ అభ్యర్థులు తమ బయోడేటా/సి వి ను వెంటనే tomcomglobal@gmail.com, tomcom.resume@gmail.com లకు మెయిల్ చేయవచ్చని, ఇతర వివరాలకు 9440048590, 9440049937, 9440051452, 8919047600 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రజాపాలనాలో ఉచిత వైద్యశిబిరం.

**జన సముద్రం ప్రతినిది పి శ్రీనివాస్.**

ఆమనగల్ మున్సిపల్ 5వ వార్డులోని నవచైతన్యకాలనీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర నిర్వహించిన ప్రజపరిపాలన ప్రగతిప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం హెల్త్ క్యాంపు స్థానిక ప్రముఖ సంఘసేవకులు, మున్సిపల్ కౌన్సిలర్ పాపిశెట్టిరామ్. ప్రారంభించ డంజరిగింది,కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మహిమూనా, ఎన్ఎమ్. నీరజ కుమారి, భారతి ఎన్ఎమ్, ఆశావర్కర్లు,చంద్రకళ, వసంత, సంధ్య,



బీబీ, విజయ, నయీమా, సల్మా, అదేవిధంగా నాయకులు జంతుక కిరణ్, చలిచీమల సతీష్, శ్రీను నాయక్, శేఖర్, రాములు, ఈదయ్య, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే పరమావధిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2, 2026: తెలంగాణ





ప్రజల సంక్షేమం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రోజు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గ్రామ సభ/వార్డు సభల నిర్వహణలో భాగంగా మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుచరిత, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ లతో కలిసి హాజరై 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సంబంధిత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల, రేవంత్ రెడ్డి ,సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరిగాయని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులు, మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులు, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, ఇందు కొరకు ప్రభుత్వం 13వేల కోట్ల రూపాయల ఖర్చు చేసిందని తెలిపారు. ఈ నెలలో 3 నెలల రేషన్ బియ్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రాష్ట్రమంతట మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అవకాశం కల్పించడం జరిగిందని, తద్వారా ఇప్పటి వరకు 10 వేలకోట్ల రూపాయలు మహిళలకు ఆదా అయ్యాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు వడ్డీలేని రుణాలు కల్పించి వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సహించడం జరుగుతుందని, రుణం పొందిన సంఘాల సభ్యులు సకాలంలో తిరిగి చెల్లించి మళ్లీ రుణం పొందవచ్చని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు భాగస్వామ్యం కల్పించడం జరిగిందని, విద్యార్థుల ఏకరూప దుస్తులు తయారుచేసే అవకాశం కల్పించడం జరిగింది తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రుణమాఫీ కల్పించి రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలను కుటుంబ పెద్దగా గుర్తించి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది నూతన లబ్ధిదారులకు పింఛన్లు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా జిల్లాలోని దాదాపు 6 వేల నుండి 7 వేలమంది లబ్ధిదారులకు పింఛన్లు అందుతాయని, దివ్యాంగుల పింఛన్ల మంజూరులో దివ్యాంగత్వ పరీక్షల ధ్రువపత్రం ఆధారంగా అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందని, దాదాపు 3 వేల ఇండ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 300 ఇండ్లు పూర్తి చేయబడి బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలలో అల్పాహార పథకం కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల దివ్యాంగులకు మోటారు సైకిళ్ళు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్నిబట్టి పంట మార్పిడి విధానాన్ని అమలుచేసి ఆర్థికంగా లబ్ధి పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించి ఆయిల్ పామ్, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై వివరించడం జరుగుతుందని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల నిర్వహణ, పారిశుద్ధ్య అమలు, త్రాగునీటి సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా సీజనల్, అంటు వ్యాధులను నియంత్రించి ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంపొందించవచ్చని తెలిపారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా చెన్నూర్ ప్రాంతంలో బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కుటుంబ భీమా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మన గ్రామం... మన బాధ్యత...





మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ ఏప్రిల్ 2

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 42 గ్రామ పంచాయితీలలో, 13 వార్డులలో హెల్మెట్ ధరించాలానే నియమం 100% అమలు.

హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించిన గ్రామస్థులు, వార్డు ప్రజలు.

ఏప్రిల్ 2 నుండి జిల్లాలో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలు మరియు వార్డులలో హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడం జరిగింది

జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 42 గ్రామ పంచాయతీలు మరియు 13 వార్డులలో ఈ కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా 100% అమలు చేస్తూ, అన్ని గ్రామాలలో విస్తృతంగా ర్యాలీలు నిర్వహించడం జరిగింది. గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని హెల్మెట్ వినియోగంపై చైతన్యం కల్పించారు. నిర్వహించిన కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా 100% అమలు చేశారు. గ్రామాల్లోకి హెల్మెట్ లేకుండా ప్రవేశం లేదని సూచిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది.

అదేవిధంగా, ఇప్పటి వరకు జిల్లాలోని 12 గ్రామాలలో 58 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఆయా గ్రామాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచడం జరిగింది. ఈ చర్యల ద్వారా గ్రామ భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు, రోడ్డు భద్రత నియమాల అమలుకు కూడా సహకారం అందుతోంది. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్ పలు గ్రామాలలో సందర్శించి ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ సర్పంచులు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, యువత, మహిళలు మరియు ప్రతి గ్రామస్థుడికి జిల్లా పోలీస్ శాఖ తరఫున మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఇక్కడితో ఆపకుండా, భవిష్యత్తులో కూడా కొనసాగిస్తూ మరిన్ని గ్రామాలకు విస్తరించాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వినియోగాన్ని అలవాటు చేసుకుని, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# మహనీయుల ఆశయాలను కొనసాగించాలి,





**•శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317 వ వర్ధంతి వేడుకలు,**

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ,**

జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2, 2026:

మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, బి. సి. సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తురుష్క సైనికులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని, రాజ్యాధికార సాధనపై ప్రజలలో చైతన్యం కలిగించారని, బానిస ప్రజల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు. మహనీయుల చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు అందించవచ్చని తెలిపారు. ప్రభుత్వం మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, బి సి సమాజ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఎన్. శ్రీనివాస్, బి. సి. సంఘాల ప్రతినిధి కె.లచ్చన్న, గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధి ముఖేష్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామ సభ,

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**

జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2, 2026: రాష్ట్ర





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండలం కిష్టంపేట, తాండూర్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలకు అధికారులతో కలిసి హాజరై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ ప్రజాపాలన – ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపల్ కార్పొరేషన్ లోని డివిజన్లు, మున్సిపాలిటీలలోని వార్డులలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని, ఈ పథకాల ప్రగతి వివరాలను ప్రజలకు వివరించి పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామసభలు, వార్డు సభల ద్వారా ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సాహం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు పథకాల లబ్దిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యుత్, పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ

వెల్దండ ఏప్రిల్ 03 జనసముద్రం న్యూస్



చేర్యాకర్ గ్రామస్తుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తూ చేర్యాకర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది,ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాస అధ్యక్షత వహించారు,కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు మరియు భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, దరఖాస్తుల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని అధికారులుకు సూచించారు అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామంలో చేపట్టాల్సిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు మరియు వీధి దీపాలు ఆధునీకరణపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు అనంతరం సర్పంచ్ శ్రీనివాస మాట్లాడుతూ "ప్రజా పాలన అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, ఇది ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉన్న వారధి. వార్డు సభ్యుల సమన్వయంతో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేయడమే మా లక్ష్యం. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం అని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి హరణి, ఉపసర్పంచ్ కొండలు, వార్డు మెంబర్లు పురుగుల లాలయ్య,పురుగుల రమేష్, కుమారస్వామి,కేశమోని పూజ, గొర్రె పద్మ తదితరులు పాల్గొన్నారు

# కార్పొరేటర్ రంగంలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించేందుకు ఇంటర్న్షిప్,

**•మంచిర్యాల జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్,**

జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2, 2026:

కార్పొరేటర్ రంగంలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించేందుకు ఇంటర్న్షిప్ అవకాశం కల్పించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జిల్లా పరిధిలోని అర్హత కలిగిన యువతకు ప్రధానమంత్రి ఇంటర్న్షిప్ (రౌండ్ 3) పథకం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేయడం జరుగుతుందని, ఈ పథకం ద్వారా భారత దేశంలోని ప్రముఖ సంస్థలలో చెల్లింపుతో కూడిన ఇంటర్న్షిప్‌ల ద్వారా పరిశ్రమల అనుభవం, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు 6 / 9 నెలల ఇంటర్న్షిప్ కాలం ఉంటుందని, ప్రతి నెల తగిన ఆర్థిక సహాయం అందించి ప్రముఖ కంపెనీలలో ప్రత్యక్ష అనుభవం పొందే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలని, అభ్యర్థులు పూర్తికాల ఉద్యోగంలో ఉండకూడదని తెలిపారు. యువతలో ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి, కార్పొరేట్ రంగంలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించడానికి ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 2026-27 సంవత్సరానికి గాను https://pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నం . 1800 116 090 లో సంప్రదించవచ్చని తెలిపారు.

# ఘనంగా ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక గ్రామసభలు,

- ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేపించిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్,
- దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం,
- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్,
- గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి గ్రామసభ బలమైన వేదిక,
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్,

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ ఏప్రిల్ 2**

ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా గురువారం దంతాలపల్లి మండల కేంద్రం, పెద్ద ముప్పారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన గ్రామసభకు ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, గూడూరు మండల కేంద్రంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ఇనుగుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, కేసముద్రం మున్సిపల్ కార్యాలయం, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, మరిపెడ మండల కేంద్రాలలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి గ్రామసభను ప్రారంభించారు.అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపీడీవో వినిపించగా, గ్రామ పంచాయతీ పూర్తి సమగ్ర నివేదికను పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి అన్ని విభాగాల సిబ్బంది వారి వారి శాఖల ప్రగతి నివేదిక సభలో వివరించారు. ఈ





సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల లబ్దిదారులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు వెల్లడించారు.జిల్లాలోనీ (18) మండలాలు, (5) మున్సిపాలిటీలు (98) వార్డుల ప్రత్యేక అధికారులు, (482), గ్రామపంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత అన్ని విభాగాల సిబ్బందితో కలిసి ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు అభివృద్ధి పథకాల వీడియో సందేశం ద్వారా, క్షేత్రస్థాయిలో సమగ్ర నివేదికలు చదివి వినిపించి గ్రామసభలను నిర్వహించారు,ఇనుగుర్తి మండల కేంద్రం రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, హాజరయ్యారు.

అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు.రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు,నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం - ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ..గ్రామస్థాయిలో ప్రతి సమస్య పరిష్కారానికి బలమైన వేదిక గ్రామసభ అని అన్నారు,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు.గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు,గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు,వాణిజ్య పంటల వైపు రైతులను ఆకర్షించాలని, ఆయిల్ ఫామ్, సాగు లాభదాయకంగా ఉందన్నారు, అంతర్ పంటల ద్వారా రైతులకు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు, నానో యూరియా పై ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు,ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు, గ్రామపంచాయతీ సర్పంచులు, మండల ప్రత్యేక అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామసభ,

**ధర్మారం గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి మణిదీపక్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాలిక కార్యక్రమంలో భాగంగా ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రోజున గ్రామసభ నిర్వహించారు, సందర్భంగా ధర్మారం గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి మణిదీపక్, మాట్లాడుతూ, ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకొని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు, గ్రామ సభలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభివృద్ధికై ప్రవేశపెట్టిన వివిధ రకాల పథకాల లబ్ధిదారులు తమకు ప్రభుత్వం నుండి అందుతున్న ప్రయోజనాలను తెలియజేశారు, కార్యక్రమంలో ధర్మారం గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ జీనత్, దాంపూర్ మాజీ సర్పంచ్ దాసరి మధునయ్య, వార్డు సభ్యులు, ప్రజలు, పాల్గొన్నారు

# ప్రజల క్షేమమే పోలీస్ లక్ష్యం: మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 2**



మహబూబాబాద్ పట్టణంలోని లోని షాదీఖానా వద్ద జరిగిన "ప్రజా పాలన-వార్డు సభ" లో భాగంగా జిల్లా ఎస్పీ డా. శభరిష్ పి. ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు 21, 22, 23, 24, 25, 26 మరియు 36 వార్డులకు చెందిన మొత్తం 7 మంది కౌన్సిలర్లు మరియు కాలనీ నివాసితులతో టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వారి వారి వార్డుల్లో మరియు కాలనీలలో ద్విచక్ర వాహనదారులందరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందిగా కోరారు. అలాగే గంజాయి ఇతర మత్తు పదార్ధాల వినియోగదారుల గురించి సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని తెలిపారు. ముఖ్యంగా నేరాలను నివారించడానికి ప్రతీ వార్డుల్లో/కాలనీలలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో "మన వార్డు-మన భాద్యత" అని మార్పు కనిపించేలా కృషి చేయాలని టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కోరారు.

# దివ్యాంగుల సహాయ ఉపకరణముల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళి నాయక్

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 2**

మహబూబాబాద్

ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో 2020-2021 గణాంకాల ప్రకారం మన జిల్లాలో 24105 మంది దివ్యాంగులు ఉన్నారు .ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత దివ్యాంగులు అన్నిరంగాలలో రాణించాలని వారి ఆర్థిక సామాజిక పరిస్థితులు మెరుగు పరిచి వారిలో మనోధైర్యం నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుంది.

అందులో భాగంగా నూతన జిల్లా ఏర్పాటు జరిగిన తరువాత దివ్యాంగులకు ప్రతినెల 4016 రూపాయల పింఛను చొప్పున అందిస్తూ ఆర్థికంగా బాసటగా నిలవడం జరుగుతుందన్నారు



రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల జీవన శైలిలో మార్పుకు, ఉపాధి కల్పించడానికి ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీంలో భాగంగా అర్హులైన దివ్యాంగులకు 100% సబ్సిడీ బోన్లు ఇవ్వడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సకలాంగులు దివ్యాంగులను, దివ్యాంగులు దివ్యాంగులను వివాహం చేసుకున్నట్లు అయితే వారి ఉపాధికి తోడ్పాటుకు లక్ష రూపాయలు అందజేయడం జరుగుతుంది.అంగవైకల్యంతో రవాణా ఇబ్బంది కాకుండా అర్హులైన దివ్యాంగులకు రిట్రో పిట్టెడ్ మోటార్ వాహనాలను ప్రభుత్వం ఉచితంగా అందజేయడం జరుగుతుంది. అంతే కాకుండా మారుతున్న ఆధునిక యుగానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవడానికి ఇచిత లాప్టాప్లను ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు బాసటగా నిలుస్తుంది. అదే విధంగా 5 జి స్మార్ట్ఫోన్స్, మస్కులార్ డిస్ట్రిపి బాధితులకు, వెన్నుపూస సమస్యలు కలవారికి బ్యాట్రి వీల్చైర్స్ అందిచబడుతున్నాయి.

2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రెట్రో ఫిట్టేడ్ మోటార్ వాహనాలు 2. బ్యాట్రి వీల్చైర్స్ 3. బాటరీ ట్రైసైకిల్స్

ఈ యొక్క కార్యక్రమంలో దివ్యాంగుల సంబంధిత శాఖ అధికారులు, పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు...

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డ్ సభ

**- దరఖాస్తులను స్వీకరిస్తున్న కౌన్సిలర్ కనుమల్ల రాజశేఖర్**

**చొప్పదండి(జనసముద్రం న్యూస్):**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డ్ సభ కార్యక్రమంలో భాగంగా చొప్పదండి పట్టణ కేంద్రం లో 4వ వార్డ్ పరిధి లోని సాయిబాబా గుడి దగ్గరలో నిర్వహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంక్షేమ పథకాలు, చొప్పదండి నియోజకవర్గంలో శాసన సభ్యులు మేడిపల్లి సత్యం గారి ఆదేశాల మేరకు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర సంవత్సరాలలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు పూర్తిగా వివరించి, 4వ వార్డ్ లోనీ వార్డ్ సమస్యల గురించి వార్డ్ ప్రజలతో చర్చించి, ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్, మెదలగు దరఖాస్తులను కౌన్సిలర్ కనుమల్ల రాజశేఖర్ స్వీకరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముద్దం మల్లేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి అఖిల్ గౌడ్, సోమిడి శ్రీనివాస్, మున్సిపల్ వార్డు అధికారి రమాదేవి, ఆర్పి రొడ్డవేని లక్ష్మి వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# సీతారాముల కళ్యాణ లో పాల్గొన్న యర్ర గొల్ల రెడ్డెయ్య యాదవ్, పోలి రెడ్డి సుబ్బారెడ్డి

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ మార్చి 2**



అన్నమయ్య జిల్లా పందిళ్లపల్లె నందు సీతారాముల కళ్యాణ మహోత్సవం కు హాజరై పూజారులచే ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు అందుకొని అన్నదాన ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న అటవి శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ యర్ర గొల్ల రెడ్డెయ్య యాదవ్, మాజీ డిసిసిబి డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డిఈ కార్యక్రమంలోమాజీ ఎంపిటిసి రాజేంద్ర రెడ్డి,పటాన్ సాదుల్లా, ప్రసాద్ రెడ్డి ,విశ్వనాథ ,మల్లికా,గురుమూర్తి, వల్లేపు నాగార్జున, పి శ్రీనివాసులు,ఆనంద్, తదితరులు పాల్గొన్నారు

# వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి,

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ ఏప్రిల్ 2, 2026:**



వేసవికాలం సమీపిస్తున్నందున ప్రజలకు త్రాగునీటి సమస్యలు లేకుండా ముందస్తుగా చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపాలిటీలో అమృత్ 2.0 పనుల పురోగతిని ఆకస్మికంగా సందర్శించి పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న త్రాగునీటి సరఫరా, పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం అయినందున ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ డి.ఈ.ఈ. ను ఆదేశించారు. పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయం కల్పించడమే అమృత్ 2.0 లక్ష్యమని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సమయపాలనతో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యం



**చొప్పదండి, ఏప్రిల్ 02(జన సముద్రం న్యూస్ ):**

మండలంలోని కాట్నపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, నాయకులు గాజంగి రాములు, చుప్ప శ్రీనివాస్, కట్టేకోల లక్ష్మణ్, కట్టేకోల శ్రీనివాస్, పెరుక శ్రీనివాస్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్" జయంతి వేడుకలు.

**జనసముద్రం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఏప్రిల్ 3**



కుత్బుల్లాపూర్ గాజుల రామారం డివిజన్ పరిధిలో కైసర్ నగర్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. భక్తుల కోరిన కోరికలను నెరవేరుస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే దైవం అభయాంజనేయ స్వామి అని, స్వామివారి కృపా కటాక్షాలు భక్తులపై సంపూర్ణంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా రాము లోరీ రథోత్సవం
## భక్తిరసంతో అలరించిన శ్రీ కోదండరాముని రథోత్సవం



**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఏప్రిల్ 2:**
ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.
ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ రథోత్సవంలోశ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత భక్తిరసమయం చేశాయి. భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగుతూ అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.
రథోత్సవానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యం విశేషం. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులని భావించి, ఆత్మఅనాత్మ వివేకాన్ని గ్రహించేందుకు ఈ ఉత్సవం మార్గదర్శకంగా నిలుస్తుంది.
ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, డెప్యూటీ ఈవో ప్రశాంతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబానికి జనసేన భరోసా

- గుండెబోయిన సాంబశివరావు మాచర్ల మండల జనసేన పార్టీ అధ్యక్షులు
- తాడిమల్ల రాహుల్ జనసేన పార్టీ సాగర్ గ్రామ అధ్యక్షులు



**జనసముద్రం న్యూస్,పల్నాడు జిల్లా ప్రతినిధి ,ఏప్రిల్ 02**
ఇటీవల సాగర్ లో జనసేన సానిభూతిపరుడు కోడా రాజు అనారోగ్యం తో చనిపోయాడు అది తెలుసుకున్న మండల అధ్యక్షులు గుండెబోయిన సాంబశివరావు ఆ కుటుంబానికి భవిష్యత్తు లో ఏ అవసరం ఉన్న మేము ఉన్నాం అని భరోసా ఇచ్చి మట్టి ఖర్చుల నిమిత్తం 8000 రూపాయలు ఇవ్వడం జరిగింది. దీనికి సహకరించిన గ్రామ అధ్యక్షులు తాడిమల్ల రాహుల్, స్థానిక జనసేన నాయకులు తోటకూర పరమేశ్వరరావు, రమేష్ నాయుడు, దాసరి మల్లికార్జున, వంగపాటి హరీష్, గ్రంధి నాగార్జున మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నూతన పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి






**మార్కాపురం ఏప్రిల్ 2 (జన సముద్రం న్యూస్)**
నూతన పింఛన్లను తక్షణమే మంజూరు చేయాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
బుధవారం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. విజయ సునీతను ఆమె కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం పింఛన్ల మంజూరుకు సంబంధించి వినతిపత్రాన్ని సమర్పించారు.
ఈ సందర్భంగా మహబూబ్ వలి మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని విమర్శించారు. వెనుకబడిన ఈ జిల్లాలో నిరుపేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్నారని, 60 ఏళ్లు పైబడిన వృద్ధులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. వెంటనే సమస్యపై దృష్టి సారించి పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.
కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు షేక్ షబానా, ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్, మైనార్టీ జనరల్ సెక్రటరీ షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా ఏఐటియుసి నూతన కమిటీ ఎన్నిక



**జనసముద్రంన్యూస్, నర్సరావుపేట, పల్నాడు జిల్లా, ఏప్రిల్ 2;**
ఈనెల 31వ తేదీన స్థానిక ఎన్జీఓలో ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ద్వితీయ మహాసభలు ఘనంగా జరిగాయని, ఈ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది.
ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులుగా కొమర వెంకటరావు, జిల్లా అధ్యక్షులుగా భూదాల శ్రీనివాసరావు, జిల్లాప్రధాన కార్యదర్శిగా కాసా రాంబాబు, ఉప ప్రధాన కార్యదర్శిగా ఉప్పలపాటి రంగయ్య, ఉపాధ్యక్షులుగా పెరుమాల శీను మరో ఉపాధ్యక్షులుగా రాచపూడి ఏసుపాదం, కాసా సాంబయ్య, కంబాల శ్రీనివాసరావు సహాయ కార్యదర్శిలుగా జి.టి.రావు, ఎల్ శాంతి, చారమ్మ, మిద్దె పోగురావు, అదే విధంగా చిలకలూరిపేట పెద్దకూరపాడు ఖాళీగా ఉండగా 15 మందితో ఆఫీస్ బేరర్ ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మొత్తం 49 కౌన్సిల్ సభ్యులను వివిధ రంగాల నుంచి ఎన్నుకోవడం జరిగింది.
ఈ మహాసభలో అనేక తీర్మానాలని ఆమోదించడం జరిగింది. అదేవిధంగా తిరుపతి నగరంలో ఈనెల 26 27, 28 తేదీలలో జరిగే ఏఐటీయూసీ 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

## ఎవరికి చెప్పినా పట్టించుకోవటం లేదు : బిలెదే వీర ప్రతాప్ రావు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, దాచేపల్లి, ఏప్రిల్ 2;**
దాచేపల్లి లోని నాగులేరు వాగు నుండి ఒక కాల్వ ద్వారా (పాయ) కల్వర్టు కట్టుబడి ఉందని అందరికీ తెలిసిన విషయమే. ఆ కాల్వ ద్వారా నీరు సాగునీరు పోతుంది. దానిలో డ్రైనేజి మురికినీరు పోతుంది.
ఓపంక్షన్ కు పోయినాము.
వాసవి సత్రం, కన్యకాపరమేశ్వరి గుడి వెనుక భాగంలో ఈ కాల్వవాసనకు భోజనం తినటానికి వచ్చే చెడు వాసనను ఎలా బరాయిస్తున్నారో వచ్చే పోయే జనాలకి తెలుసు. వ్యాపార సంస్థలు మరియు మసీదులు, దేవాలయాల వారిని ఎవరిని అడిగినా పట్టించుకోవటంలేదు. సంబంధిత అధికారులకు, ఎమ్. ఎల్. ఏ యరపతినేని కి పత్రికా ముఖంగా తెలపడం నా నైజం, మానవత్వం, సాటి జనానికి ఏ నష్టం జరిగినా ప్రభుత్వానికి తెలపటం నా నైజం అని, ప్రజలు శాశ్వత పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నారని లోక్సత్తా పార్టీ సీనియర్ నేత, నల్గొండ జిల్లా అధ్యక్షుడు బెలిదె వీరప్రతాపరావు తెలుపుతున్నారు.

## అంగరంగ వైభవంగా రాము లోరీ రథోత్సవం
## భక్తిరసంతో అలరించిన శ్రీ కోదండరాముని రథోత్సవం





**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఏప్రిల్ 2:**
ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ రథోత్సవంలో శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత భక్తిరసమయం చేశాయి. భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగుతూ అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. రథోత్సవానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యం విశేషం. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులని భావించి, ఆత్మఅనాత్మ వివేకాన్ని గ్రహించేందుకు ఈ ఉత్సవం మార్గదర్శకంగా నిలుస్తుంది.
ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి వీరబ్రహ్మం, డా.ఎ.శరత్, డెప్యూటీ ఈవో ప్రశాంతి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జంబుగుంపులలో జటిలంగా మారిన నీటి ఎద్దడి.

-నీటి దాహార్తి తీర్చుకోవడానికి నానా ఇబ్బందులు.
-వేసవి దృష్టిలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.



**కుందుర్పి, ఏప్రిల్ 2, జనసముద్రం న్యూస్:**
మండల పరిధిలోని జంబుగుంపల గ్రామంలో తాగునీటి ఎద్దడిని నానాటికి జటిలంగా మారిందని ఆ గ్రామస్తులు ,మహిళలు పేర్కొన్నారు. బుధవారం ఆ గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పైన ఆ గ్రామస్తులు పలువురు విలేకరులుకు సమాచారం చేరవేశారు. తమ గ్రామంలో వేసవికాలం దృష్ట్యా భూగర్భ జలాలు పంచాయతీ వేయించిన బోరు బావులలో జలమట్టం నానాటికి అడుగంటి పోవడం జరుగుతుంది. జనాలకు తాగునీటి సమస్య వర్ణానతీతంగా నెలకొందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామంలో నీటి దాహార్తిని తీర్చుకోవడానికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. అసలే వేసవికాలం భానుడు విశ్వరూపం ప్రతాపానికి ప్రజలకు గొంతు ఎండకు వస్తున్న కాస్త గుక్కెడు నీరు ఇవ్వరా అని అధికారులను, ప్రజా ప్రతినిధులను కొంతమంది ఆ గ్రామ వాసులు సూటిగా ప్రశ్నించారు.
పంచాయితీ కుళాయిల వద్ద అరకొరగా వస్తున్న నీటితో దాహంను తీర్చుకోవడానికి మహిళలు వరస సంఖ్యలో వందల సంఖ్యలో బిందెలు ఒకటి వెనుక మరికొటి ఖాళీ బిందెలు పెట్టి గంటల తరబడి పని పాటు విడిచి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని మహిళల్లో ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా కొళాయి వద్ద మహిళలు వరుసల సంఖ్యలో వందల సంఖ్యలో నీటిని పట్టుకోవడానికి బిందెలను పెట్టి వేచి ఉన్నారు. అధికారులు తాత్కాలికంగా వాటర్ ట్యాంకుల ద్వారా నేటి సరఫరా చేసేలా, లేదా గ్రామంలో నూతన బోరు బావులను ప్రవహించేలా, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆ గ్రామస్తులు కోరారు. తాము టీకారులను ప్రజాప్రతినిధులను తాగునీరు సరఫరా, గ్రామాల్లో పరిశుభ్రత, అత్రివేలలో వీధి దీపాలు వెలిగిన సమస్యలను తప్ప, వేరే సమస్యలు అడగడం లేదన్నారు. జనుల సేదు తీరడానికి నీటి సరఫరా చేయని పక్షంలో ఆగ్రామస్తుల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంను వారం రోజుల్లోగా ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారాన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ గ్రామ మహిళలు గ్రామస్తులు కోరారు.

## శ్రీ బీమరామలింగేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు..!




**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,ఏప్రిల్ 02**
మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో గురువారం నూతనంగా ప్రతిష్టించిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ బీమరామలింగేశ్వరస్వామి వారికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు గౌతమ్ జూలకంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పండితులు, గ్రామ పెద్దలు, కూటమి పార్టీల నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో ప్రతిష్టించి బీమరామలింగేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్టించి వివిధ దేవతామూర్తుల విగ్రహాలను సందర్శించి, పూజలు నిర్వహించారు. జీవ ధ్వజస్తంబం వద్ద నవధాన్యాలు వేసి, భక్తిప్రపత్తులతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున తరలివచ్చిన భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాదాల స్టాల్స్ ను ప్రారంభించి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెన్నకేశవుని సేవలో గౌతమ్ రెడ్డి..!




**జనసముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,ఏప్రిల్ 02**
పట్టణంలో కొలువుదీరిన పల్నాడు ప్రజల ఆరాధ్యదైవం శ్రీ లక్ష్మీ చెన్నకేశస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు జూలకంటి గౌతమ్ రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చక స్వాములు ఆయనను పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న స్వామివార్ల కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొమెర అనంతరాములు, ఈవో సైదయ్య, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్రుల రాజధాని అమరావతి ప్రజా రాజధాని అని ఎమ్మెల్యే .

- అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక.
- 5కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిఫలం.



**జనసముద్రం న్యూస్**
**ఏలూరు జిల్లా ఏప్రిల్ 2 ద్వారకాతిరుమల.**
ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు కోట్ల ఆంధ్రుల ప్రజల, ఆకాంక్షల మేరకు విజనరీ లీడర్ జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ప్రత్యేకంగా ఒక రోజు అసెంబ్లీ నిర్వహించి ఆంధ్ర ప్రదేశ్ ప్రజా రాజధాని అమరావతి అని, తీర్మానం చేసి గౌరవ పార్లమెంటుకి పంపడం జరిగింది. ఆ బిల్లు నిన్న పార్లమెంట్లో ఆమోదించబడి గురువారం రాజ్యసభలో కూడా ఆమోదించారు.సందర్భంగా ఐదు కోట్ల ఆంధ్రుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. శాశ్విత ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని ఆమోదించారు.దీనికి సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, భారత ప్రధాని నరేంద్ర మోడీ కి వివిధ రాష్ట్రాల పార్లమెంట్ సభ్యులకు గోపాలపురం నియోజకవర్గ ప్రజలందరూ తరపున ఎమ్మెల్యే హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన
## 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు



**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 02**
మార్చి 16వ తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 2 కు ముగిశాయి ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మండలంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు జడ్పీ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో 450 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు గురువారం ఇంగ్లీష్ పేపర్ తో పరీక్షలు ముగిశాయి దీంతో విద్యార్థిని విద్యార్థులు ఆనందంతో ఒకరికి ఒకరు కబుర్లు చెప్పుకుంటూ మార్కులు గురించి మాట్లాడుకుంటూ ఆనందంగా ఇళ్లకు బయలుదేరి వెళ్లిపోయారు మూడు సెంటర్లలో ఈ 8 రోజులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లక్కిరెడ్డిపల్లి సీఐ కృష్ణరాజు నాయక్ ఎస్ఐ గోల్కొండ శోభ 1,44 సెక్షన్ ఏర్పాటుచేసి ఎలాంటి అవాంఛనీయ జరగకుండా గట్టి భారీ బందోబస్తు మధ్య పరీక్షల నిర్వహించారు బాయ్ బాయ్ అంటూ ఒకరికి ఒకరు అభినందన తెలుపుకుంటూ ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు.

# చెన్నకేశవుని సేవలో జూలకంటి గౌతమ్ రెడ్డి..!

జనసముద్రంన్యూస్,మాచర్ల, ఏప్రిల్ 2:
పట్టణంలో కొలువుదీరిన పల్నాడు ప్రజల ఆరాధ్యదైవం శ్రీ లక్ష్మీ చెన్నకేశస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు జూలకంటి గౌతమ్ రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చక స్వాములు ఆయనను పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న స్వామివార్ల కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఈకార్యక్రమంలోఆలయఛైర్మన్ కొమెర అనంతరాములు,





ఈవో సైదయ్య, కొమెర దుర్గారావు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ భీమరామలింగేశ్వరస్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన జూలకంటి గౌతమ్ రెడ్డి..!





జనసముద్రంన్యూస్, కారంపూడి, ఏప్రిల్ 2 ;
పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండల పరిధిలోని ఒప్పిచర్ల గ్రామంలో గురువారం నూతనంగా ప్రతిష్టించిన శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ బీమరామలింగేశ్వరస్వామి వారికి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయులు గౌతమ్ జూలకంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పండితులు, గ్రామ పెద్దలు, కూటమి పార్టీల నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో ప్రతిష్టించి బీమరామలింగేశ్వరస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్టించి వివిధ దేవతామూర్తుల విగ్రహాలను సందర్శించి, పూజలు నిర్వహించారు. జీవ ధ్వజస్తంబం వద్ద నవధాన్యాలు వేసి, భక్తిప్రపత్తులతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున తరలివచ్చిన భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నప్రసాదాల స్టాల్స్ ను ప్రారంభించి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒంటిమిట్ట టిటిడి గెస్ట్ హౌస్ నందు ముఖ్యమంత్రి చంద్రబాబు ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల

**-ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని దేవాలయం అభివృద్ధికి కొన్ని వాస్తు మార్పులు అవసరం**
**-వాస్తు నిపుణులతో సంప్రదించి కొన్ని మార్పులు చేయాలని కోరిన బత్యాల**
**-రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చ.**



ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఏప్రిల్ 2:
కోదండ రాముని కళ్యాణానికి విచ్చేసి ఒంటిమిట్ట దేవస్థానం గెస్ట్ హౌస్ నందు ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ను కలిసి ఒంటిమిట్ట అభివృద్ధికి నోచుకోకపోవడానికి ఒంటిమిట్ట దేవాలయానికి పరమడ వీధి పోటు (కడప నుండి రాజంపేటకు వచ్చే రోడ్డు) ఉందని గుడిపై ప్రభావం చూపుతోందని మంచి వాస్తు నిపుణులను పిలిపించి వాస్తు రిత్యా 100 అడుగుల వెడల్పుతో మాడవీధులను తిరుమలలో చేసినట్లు చతుర ప్రకారాలను ఏర్పాటు చేయాలనీ చంద్రబాబు గారికి తెలియజేయగా వెంటనే ఆ విషయంపై స్పందించి పై సంబంధిత అధికారులను పిలిచి వారికి ఆదేశాలు జారీ చేశారు., అలాగే ఒంటిమిట్ట స్థల పురాణం గురించి కూడా మాట్లాడుకోవడం జరిగింది.

అనంతరం బత్యాల గారు రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల అభివృద్ధిపై చంద్రబాబు తో చర్చించి పలు విషయాలపై వినతి పత్రాన్ని కూడా అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జులుమరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# చికిత్స పొందుతున్న డప్పు కళాకారుడికి పెన్షన్ అందజేత

పుల్లల చెరువు,ఏప్రిల్ 3 జనసముద్రం న్యూస్.
మండల కేంద్రమైన పుల్లల చెరువు గ్రామానికి చెందిన లింగంగుంట్ల.ఏసోబు ఫిబ్రవరి నెలలో రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

ఈ కారణంగా ఆయన రెండు నెలలుగా డప్పు కళాకారుల పింఛన్ పొందలేకపోయారు.

ఆయనకు పెన్షన్ అందేలా చూడాలని కుటుంబసభ్యులు ఎంపిడివో కు విజ్ఞప్తి చేశారు.ఎంపిడివో మరియదాసు సూచనల మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీను నాయక్ గుంటూరు వైదేశాలకు వెళ్లి పింఛన్ అందజేశారు



కుటుంబసభ్యులు ఎంపిడివో,వెల్ఫేర్ అసిస్టెంట్ కు కృతజ్ఞతలు తెలిపారు

# పదవ తరగతి మూల్యాంకనంలో స్పెషల్ అసిస్టెంట్ల పని భారం తగ్గించాలి :APUS



లక్కిరెడ్డి పల్లి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 2
ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయసంఘంలక్కిరెడ్డిపల్లి మండల శాఖ కార్యవర్గ సమావేశం ఈరోజు మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక కార్యాలయం నందు మండల అధ్యక్షులు కే వి సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి పోగుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎస్ఎస్సి మూల్యాంకనంలో స్పెషల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నటువంటి ఉపాధ్యాయులకు పని భారం ఎక్కువగా ఉంటుందని వారికి పని భారం తగ్గించి అదేవిధంగా గౌరవ వేతనం కూడా పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఎం నరసింహులు మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకనంలో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు చిన్నపిల్లల తల్లులకు విధుల మినహాయింపు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి జిల్లా మీడియా ఇంచార్జ్ కె వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శులు పి బాలరాజు కే నరసింహులు మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు మండల గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు సాయిచరణ్ యాదవ్,వెంకటరమణ, రవికుమార్, లలితకుమారి,ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాజధానిగా అమరావతిని ప్రకటించడంపైఒంటిమిట్టలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు

ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఏప్రిల్ 2:
అమరావతికి పట్టిన గ్రహణం వీడిందని ఒంటిమిట్ట మండలానికి చెందిన టిడిపి నేతలు గురువారం ఒంటిమిట్ట కోదండ రామాలయం సంబరాలు జరుపుకున్నారు. ఒంటిమిట్ట జడ్పిటిసి అద్దలూరు మధు కృష్ణారెడ్డి, ఒంటిమిట్ట టిడిపి మండల అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, స్పెషల్ క్లాస్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టు ఎస్.వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలుగు తమ్ముళ్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టిడిపి పార్టీ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి ఒంటిమిట్ట కోదండ రామాలయం వద్దకు చేరుకున్నారు.

బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. జడ్పిటిసి అద్దలూరు మద్దు కృష్ణ రెడ్డి మాట్లాడుతూ గత వైకాపా



ప్రభుత్వంలో రాష్ట్రానికి మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి మూడుముక్కలాట ఆడారని అన్నారు. నేడు చట్టసభలో అమరావతికి రాజధానిగా తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని తెలుగు ప్రజలు ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఇందులకు సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటారని వారు అన్నారు. లాయర్ రామదాసు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేయలేని చట్టసభల్లో తీర్మానంలో కూటమి ప్రభుత్వం చేయడం సాహసంతో కూడుకొన్న విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి ఆలూరు వెంకటసుబ్బయ్య, టిడిపి నేత బొబ్బిలి రాయుడు, క్లస్టర్ ఇంచార్జి తుమ్మల కుంట ఈశ్వరయ్య, గఫూర్, నరసింహులు, చంద్రపాల్, ఒంటిమిట్ట చెరువు సంఘం ఉపాధ్యక్షులు కట్టా యానాదయ్య , ఒంటిమిట్ట మండలానికి చెందిన టిడిపి నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# విషం చిమ్ముతున్న వైసిపి కాల నాగులు... రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య..

ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఏప్రిల్ 2:
రాష్ట్ర రాజధానిగా అమరావతి కి చట్టబద్ధత కల్పిస్తూ లోకసభలోను , గురువారం రాజ్యసభలోను, ఉభయ సభలు ఆమోదించడం తో ఓర్వలేని వైసిపి పార్టీ అధినేత జగన్ రెడ్డి, లోకసభలో పార్టీ నేత మిథున్ రెడ్డి రాజధానిపై నిస్సిగ్గుగా విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఒంటిమిట్ట మండల టిడిపి సీనియర్ నాయకులు కొమరా వెంకటయ్య ఘాటుగా విమర్శించారు.

ఒంటిమిట్టలో గురువారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ, మూడు రాజధానులు అంటూ జగన్ రెడ్డి పార్టీ చేసిన హంగామాను ప్రజలు తిప్పి కొట్టి 11 సీట్లకు పరిమితం చేయడం జరిగిందన్నారు.

ఇంకా సిగ్గు రాని ఆ పార్టీ నేతలు రాజధాని బిల్లు ఉభయసభల్లో ఆమోదించిన కూడా తాము తిరిగి అధికారంలోకి వస్తే మళ్లీ బిల్లు పెట్టి రాజధాని నీ మార్చడం తప్పదు అంటూ రాజధానిపై అర్థం పర్థం లేని విధంగా మాట్లాడుతూ తమ మనసులో ఉన్న విషాన్ని బహిరంగంగా వెళ్ల కక్కుతున్నారని వెంకట నరసయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని, రాష్ట్రాలకు ప్రత్యేకించి రాజధాని ఉంటుందంటూ రాజ్యాంగంలో ఎక్కడ పేర్కొనలేదని జగన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదం, ఆ పార్టీ రాజకీయ అజ్ఞానానికి ఒక నిదర్శనమని అన్నారు. జగన్ రెడ్డి చేస్తున్న వాదనను రాష్ట్రంలోని రాజకీయ పరిజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరూ చర్చించుకుంటూ పగలబడి నవ్వుకుంటున్నారని అన్నారు. కొన్ని దేశాల్లో మూడు రాజధానులు ఉన్నాయంటూ ఆ దేశాల పేర్లను వైసిపి నాయకులు పత్రికా సమావేశంలో వెల్లడి చేసి వారి అజ్ఞానాన్ని ప్రజలముందు మరింతగా వెల్లడి చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. అటు లోకసభలోను ఇటు రాజ్యసభలోను రాజధాని బిల్లును ఆమోదించిన కూడా వైసిపి విమర్శలు మానుకోవడం పోవడంతో



ప్రజల్లో ఆ పార్టీ మరింతగా చులకన కావడం జరిగిందన్నారు., ఇంకా తాము అధికారంలోకి వస్తే మళ్లీ రాజధాని బిల్లు తెస్తానంటూ జగన్ రెడ్డి పేర్కొనడం ప్రపంచంలో కెల్లా మరో వింతైన విషయమని వెంకట నరసయ్య పేర్కొన్నారు. భ్రమ నుండి వాస్తవంలోకి వైయస్సార్ నాయకులు రావాలని ఆయన హితవు పలికారు.

చంద్రబాబు పేరు సువర్ణ అక్షరాలతో లిఖించ బడుతుంది..

# ఏపీ రాజధాని అమరావతి బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందడంపై... గుడివాడలో కూటమి శ్రేణుల సంబరాలు

జనసముద్రం న్యూస్ గుడివాడ ప్రతినిధి. ఏప్రిల్.02.
ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్, రాజ్యసభ ఏకగ్రీవంగా ఉభయసభలు ఆమోదించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గుడివాడ కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు.

ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయం నుండి నెహ్రూ చౌక్ సెంటర్ వరకు జై అమరావతి అంటూ నినాదాలు చేస్తూ కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ చౌక్ సెంటర్లో టపాసులు పేలుస్తూ నినాదాలు చేసిన నాయకులు ఒకరికి ఒకరు మిఠాయిలు తినిపించుకున్నారు.

ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ....రైతుల త్యాగాలకు న్యాయంఉ నేడు ఓ చారిత్రాత్మక రోజు అన్నారు.12 ఏళ్లుగా రాజధానిపై అస్పష్టతఉ అభివృద్ధి, పెట్టుబడులు తీవ్రంగా దెబ్బతిన్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు.మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పాపం వైకాపాదని మండిపడ్డారు.

సీఎం చంద్రబాబు దూరదృష్టితో అమరావతి




ప్రపంచ స్థాయి రాజధాని దిశగా అడుగులు వేస్తుందని,ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పంతో వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది ఏర్పడుతుందని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, దింట్యాల రాంబాబు, దానేటి సన్యాసిరావు, వాసే మురళి, చేకూరు జగన్ మోహన్ రావు,అరికెపూడి రామశాస్త్రి,గోర్జి సత్యనారాయణ,మజ్జి శ్రీనివాసరావు, గోకవరపు సునీల్, మజ్జడ నాగరాజు, ఈడే మోహన్,నాగేశ్వరరావు,సాంబశివరావు, వంగపండు ఆదినారాయణ, మెరుగుమాల బ్రహ్మయ్య, రామ దీని వేణు, రబ్బాని, జబీన్, కరీముల్లా, డేవిడ్, అందుగుల యేసుపాదం, సాల్మన్ రాజ్,పాదం, కొల్లారెడ్డి బాబి, అంజిరెడ్డి, జోజి, సాయన రాజేష్, వేమూరి త్రినాధ్,బాంబే శీను, వసంతవాడ దుర్గారావు నిమ్మగడ్డ సత్యసాయి, పంచకర్ల మహేష్, లోయ విజయ్, నిమ్మగడ్డ అరవింద్, నిరంజన్, సాగర్,జానీ షరీఫ్, సర్కార్, అడుసుమిల్లి శ్రీనివాస్,కనకాలనాగేశ్వరావు,చుక్క వెంకటేశ్వరావు, బాలసాని భవాని,దేవేంద్రుడు, కుందేటి ప్రసాద్, ఇమ్మానియేల్,నేరుసు కాశి, కటికల కళ్యాణ్, డొక్కుమాలశ్రీకాంత్,సూరగనిసూరిబాబు,దొండపాటి మహేష్,మాదాసుప్రసాద్,కాసానిశ్రీరామ్,ఇబ్రహీం, మోజెష్,గోరిపత్తి సుబ్బారావు, దేవరపల్లి కోటి,తులసి రాణి, మల్లికా బేగం, కొల్లు రమ్య, దివ్య చౌదరి, సునీత, బుర్ర శాంతి, రమాదేవి,గూడపాటి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# జయహో అమరావతి జయజయహో అమరావతి! మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి




జనసముద్రం న్యూస్ ,ఏప్రిల్.02.
ఐదున్నరకోట్లఆంధ్రులకలలునేడుసాకారమయ్యాయి. ఒకప్పుడు "మీ రాష్ట్ర రాజధాని ఏది?" అనే ప్రశ్నకు స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉండగాఉ నేడు యావత్ తెలుగుజాతి గర్వంగా "మా రాజధాని అమరావతి" అని చెప్పే స్థాయికి చేరుకుంది అని మంత్రి పోర్కొన్నారు

తెలుగు ప్రజల కలల రాజధాని అమరావతి చట్టబద్ధతను పొంది, లోక్‌సభ మరియు రాజ్యసభల్లో ఆమోదం పొందడం చారిత్రాత్మక ఘట్టం. ఇక నుంచి అమరావతి రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, భవిష్యత్తుకుదారితీసే కేంద్రబిందువుగా నిలవనుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని 44 ఏళ్లుగా కాపాడుతూ వచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదే. అదే సంకల్పంతో నేడు రాజధాని అమరావతికి చట్టబద్ధత తీసుకువచ్చి, ప్రజల పట్ల తన చిత్తశుద్ధిని మరోసారి నిరూపించుకుంది కూటమి ప్రభుత్వం.

ముఖ్యమంత్రినారాచంద్రబాబు నాయుడు అచంచల సంకల్పం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారం, కేంద్ర ప్రభుత్వ మద్దతు, రాష్ట్రంలోని కూటమి పార్టీల సమన్వయం, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ కఠోర శ్రమ ఈ సమష్టి కృషి ఫలితమే నేడు అమరావతికి లభించిన ఈ చట్టబద్ధ గుర్తింపు.అని అన్నారు

ఏపీ ప్రజల చిరకాల వాంఛ అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించిన లోక్‌సభ, రాజ్యసభ, కేంద్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

తెలుగువారందరికీ గర్వకారణమైన రాజధానిని నిర్మించే దిశగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అమరావతి తెలుగు ప్రజల గర్వకారణం భవిష్యత్ తరాల ఆశాకిరణంఅని మంత్రి పేర్కొన్నాడు

# యడవల్లి లో 100లీటర్ల బెల్లపు ఉటను ధ్వంసం

జనసముద్రం న్యూస్ చింతలపూడి ప్రతినిధి ఏప్రిల్ 02
ఏలూరు శ్రీమతి .శ్రీలత మేడం, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఏలూరు . కె.వి.యన్.ప్రభు కుమార్ , డపేవు

ఏలూరు జిల్లా .ఆవులయ్య ఆదేశాల ప్రకారం చింతలపూడి స్టేషన్ అధికారులు మరియు సిబ్బంది కలిసిఎక్సైజ్ నేరములకొరకు దాడులు నిర్వహించగా లింగపాలెం మండలం వెస్ట్ యడవల్లి గ్రామానికి చెందిన పల్లగాని చెన్నారావు అను వ్యక్తికి సంబంధించిన (100) లీటర్ల బెల్లపు ఉటను ధ్వంసం చేసి అతనిపై పరారీ కేసు నమోదు చేయడమైనది

అలాగే చింతలపూడి మండలం రేచర్ల గ్రామానికి చెందిన బాణావతి వెంకట్రావు అను వ్యక్తిని మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ చింతలపూడి వారి ఎదుట హాజరు పరచగా 128 బస్ చట్ట ప్రకారం బైండోవర్ బాండ్ విధించినారు

అలాగే ఈరోజు చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో అలాగని వెంకటేశ్వరరావు మరియు కంచర్ల శ్రీనివాసరావు అను ఇరువురు వద్ద రసాయన పరీక్షల పంపు నిమిత్తం కల్లుని శాంపుల్ గా తీయడం అయినది




ఈ దాడుల లో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఎస్.ఐ లు జె. జగ్గారావు మరియు ట్రైని ఎస్ ఐ బొప్పన ధనలక్ష్మి మరియు సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సి. ఐ.పి.అశోక్ తెలిపినారు.